సాక్షి సంగారెడ్డి

శుక్రవారం ၊ 13 ၊ జనవరి ၊ 2023



మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

హుస్నాబాద్ రూరల్ మండలం పొట్లపల్లి గ్రామంలో పురాతన మల్లికార్జున స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. IIలో



ట్యాంకు ఎక్కి హల్‌చల్ IIలో

చేగుంటలో ఓ వ్యక్తి ట్యాంక్ ఎక్కి హల్ చేశాడు. తన సమస్యను పరిష్కరించాలని, లేదంటే కిందకు దూకుతానని డిమాండ్ చేశాడు.



ప్రజల ఆరోగ్యానికి చర్యలు IIIలో

ప్రజారోగ్యానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముగ్గు మీది.. ప్రచురణ మాది



రంగవల్లులు వేయడం మీకు ఇష్టమా..?

ఆకర్షణీయంగా ముగ్గులు వేస్తారా..? సంక్రాంతి పండగ సందర్భంగా శనివారం మీ వాకిట్లో అందంగా వేస్తారా.. అయితే దాన్ని మాకు వాట్సాప్ చేయండి. 'సాక్షి' పత్రికలో ప్రచురిస్తాం.

ఫోన్ నంబర్: 97053 46792

యాసంగికి ఢోకా లేదు!

సింగూరు ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

- 30 ఏళ్ల తర్వాత నిండుకుండలా జలవనరులు
- జోగిపేట మండలంలో 13 వేల ఎకరాలకు సాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

జోగిపేట(అందోల్): మూడు దశాబ్దాల పాటు సాగుకు నోచుకోకుండా బీడుగా మారిన 300 ఎకరాలు ఈ యాసంగిలో పచ్చదనంతో కళకళలాడనున్నాయి. ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టు నుంచి అల్మాయిపేట పరిధిలోని మూడు చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుండటంతో జలకళను సంతరించుకున్నాయి. అందోల్ మండల పరిధిలోని అల్మాయిపేట, చందంపేట, సాయిబాన్‌పేట గ్రామాలకు సాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో ఈ ప్రాంతంలో కేవలం వర్షాకాలంలో మాత్రమే అక్కడక్కడ సాగు చేసుకునే పరిస్థితి ఉండేది. యాసంగి సీజన్‌లో మాత్రం ఎకరా కూడా సాగు చేసే వారు కాదు.

- సింగూరు ప్రాజెక్టు నుంచి అందోల్ మండలంలోని 50 చెరువులకు నీటిని తరలిస్తున్నారు. ఈ నీటి సౌలభ్యంతో 13 వేల ఎకరాల వరకు రైతులు పంటలను సాగు చేస్తున్నారు.
- గతంలో అల్మాయిపేట, చందంపేట గ్రామాల్లో కేవలం ఆరుతడి పంటలను మాత్రమే పండించేవారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఈ ప్రాంతంలోని చెరువులను నింపేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.



అల్మాయిపేట చెరువు కింద వరి నాటు

- అల్మాయిపేట గ్రామ పరిధిలోని కుడి చెరువు, దేవుని చెరువు, బైట కుంటల పరిధిలో 300 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. సింగూరు నీటి రాకతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. డీ7 కాల్వ ద్వారా మూడు గ్రామాలకు నీటిని తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.
- సింగూరు ప్రాజెక్ట్ ద్వారా నియోజకవర్గం పరిధిలో 40వేల ఎకరాలకుపైగా సాగునీటిని అందిస్తున్నారు. అందోలు, పుల్కల్ మండలాల పరిధిలోని అన్ని చెరువుల్లోకి నీరు చేరేలా చర్యలు చేపట్టారు.
- ఇటీవల జిల్లా ఇరిగేషన్ ఈఈ నేతృత్వంలో ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ, ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ల బృందం పర్యటించి కాల్వల ద్వారా నీరు వెళ్తుందా? లేదా? పరిశీలించారు.



అల్మాయిపేట చెరువులోకి చేరుతున్న సింగూరు నీరు

సంతోషంగా ఉంది



చాలా ఏళ్ల తర్వాత చెరువులను నింపడం చాలా ఆనందంగా ఉంది. సింగూరు ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీటితో పంటలు పండించుకుంటాం. గ్రామంలోని రెండు చెరువులు, ఒక కుంటలోకి నీరు వచ్చి చేరుతోంది. చాలా కాలం తర్వాత ఈ ప్రాంత రైతులు అన్ని రకాల పంటలు సాగు చేసుకునే అవకాశం దొరికింది.

– రాములు, రైతు, అల్మాయిపేట

కాల్వలో పూడిక తీయించాను



సంగుపేటలోని డీ7 కాల్వ నుంచి అల్మాయిపేట గ్రామ పరిధిలోని చెరువులకు సింగూరు నీరు తరలించేందుకు కాల్వలను శుభ్రం చేయించాను. సొంత ఖర్చులతో జేసీబీ ద్వారా 2.కి.మీ పొడవునా కాల్వలో పూడికను తొలగించాను. ఈ కాల్వ నుంచి కుడి చెరువు, దేవునిచెరువు, బైటకుంటల పరిధిలో 300 ఎకరాలకు సాగు నీరు అందనుంది.

– బుద్దోల్ల బాలమణి, అల్మాయిపేట సర్పంచ్

చెరువుల్లోకి సింగూరు నీరు

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదేశాలతో అందోలు మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులను సింగూరు ప్రాజెక్ట్ నీటితో నింపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అల్మాయిపేట చెరువులోకి నీటిని తరలించడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. అల్మాయిపేట, చందంపేట, సాయిబాన్‌పేట గ్రామాల్లోని చెరువులను నింపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

– జి.బాలయ్య, ఎంపీపీ అధ్యక్షుడు, అందోలు

రైతుల సేవలో సహకార సంఘాలు



మాట్లాడుతున్న చిట్టి దేవేందర్ రెడ్డి

పుల్‌కల్(అందోల్): సహకార సంఘాలు లాభాపేక్ష లేకుండా రైతులకు సేవా చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం పుల్‌కల్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్మించిన 500 ఎంటీ సామర్థ్యం గల గోదామును జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, ఎంపీపీ చైతన్య రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు రుణాలు అందించడమే కాకుండా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను లాభాపేక్ష లేకుండా అందించాలని సహకార సంఘాల పాలక వర్గాలకు సూచించారు. యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో ఎరువులు, రసాయన మందులను నిల్వ ఉంచాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో సహకార సంఘాలు లాభాల బాటలో పయనిస్తున్నాయని తెలిపారు. పుల్‌కల్ సహకార సంఘం పరిధిలోని రెండు గ్రామాల పరిధిలోని రైతులకు రూ.46 కోట్ల రుణాలను మంజూరు చేశామని, 500 ఎంటీ గోదామును నిర్మించి రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, ఆత్మ కమిటీ అధ్యక్షుడు యదగిరిరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీడీఓ మధులత, పుల్‌కల్ పీఏసీఎస్ చైర్మన్ అనంతరావు కులకర్ణి, ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, సర్పంచ్ శ్రవణ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ మహేశ్‌బాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్



చెక్కులు పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. తన నివాసంలో గురువారం సదాశివపేట, కొండాపూర్ మండలాలకు చెందిన 46 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.17,78,500ల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ఆపద సమయంలో పేదల ప్రాణాలను నిలబెడుతుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు భయపడవద్దని, ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మల్లన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులు సహకరించాలి



బోరంచ రైతులతో అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మనూరు(నారాయణఖేడ్): బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి భూ సేకరణకు సంబంధించి రైతులతో అదనపు కలెక్టర్ వీరారెడ్డి గురువారం సమావేశం అయ్యారు. బసవేశ్వర ఎత్తిపోతల పథకంతో కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. రైతులు తమ భూములు ఇచ్చి సహకరించాలని కోరారు. రైతులు భూములు ఇవ్వడానికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నారాయణఖేడ్ ఆర్డీఓ అంబదాస్‌రాజేశ్వర్, ఎంపీటీసీ రాములు, ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మల్లికార్జునుడి హుండీ ఆదాయం రూ.9.8 లక్షలు

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పట్టణంలోని బీరంగూడ గుట్టపై వెలసిన భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.9.80 లక్షలు వచ్చింది. గురువారం హుండీ ఆదాయన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సుపరింటెండెంట్ శివరాజు, ఆలయ అధికారి శశిధర్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ తులసిరెడ్డి, పెంటయ్య గౌడ్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయమే మేలు

ఝరాసంగం(జహీరాబాద్): సేంద్రియ వ్యవసాయమే మేలని, సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న రైతుల అభివృద్ధికి, సాగులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు జిల్లా అధికారులు పేర్కొన్నారు. ఇటీవల మంత్రి హరీశ్‌రావు అరణ్య వ్యవసాయ సంస్థను సందర్శించి, గ్రామంలో సేంద్రియ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధికారులకు ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని బిడెకన్నె గ్రామ శివారులోని అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థలో సంస్థ సీఈఓ పద్మ, డైరెక్టర్ నర్సన్న, డీఆర్డీఓ శ్రీనివాసరావు సేంద్రియ రైతులతో చర్చించారు. రైతులు తమ వ్యవసాయ పొలాల్లో బోర్ల తవ్వకం, నీటి నిల్వ కట్టడాలు, చెక్ డ్యాంల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా దాల్ మిల్, ఆయిల్ మిల్, మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్, సీడ్ లైసెన్స్, బయోచార్ ఫెర్టిలైజర్ లైసెన్స్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. త్వరలో సర్వే చేసి బోర్లు తవ్విస్తామని అధికారులు పేర్కొన్నారు. పండ్ల తోటలు, వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించి పనులు చేపడతామన్నారు. ప్రభుత్వ రాయితీలు, సౌకర్యాల గురించి రైతులకు వివరించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నర్సింగరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబురావు, ఆర్టికల్చర్ జిల్లా అధికారి సత్తార్, గ్రౌండ్ వాటర్ అధికారి వెంకటేశ్వర్ రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ గోపాల్ రెడ్డి, ఎంపీడీఓ సుజాత, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్, ఏపీఓ రాజ్‌కుమార్, ఏపీఎం బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ రైతు సంఘం ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీనివాసరావు

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

జహీరాబాద్: యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణదాతలు కావాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. గురువారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ భరతమాత ముద్దు బిడ్డ స్వామి వివేకానందుడి జయంతిని ప్రపంచ దేశాలు ఘనంగా జరుపుకుంటున్నాయన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయం, ఔన్నత్యాన్ని విదేశాల్లో చాటి చెప్పిన మహనీయుడు వివేకనంద అన్నారు. ఈ శిబిరంలో 200 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్, పద్మశాలి యువజన సంఘం నాయకులు దండి విఠల్, గడ్డం రాజేశ్, పండాల్ జగదీశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, నాయకులు పి.సుధీర్‌కుమార్, కె.జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జగన్, సోమ అనిల్, శ్రీనివాస్‌గుప్తా, అర్చన సారదా, ఉమారాణి తదితరులున్నారు.



ప్రశంస పత్రాలను అందజేస్తున్న ఈటల రాజేందర్

చివరి ఆయకట్టుకు నీరు



గంగాపూర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ ఎస్ఈ మురళీధర్

నారాయణఖేడ్: గంగాపూర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు రైతులకు కూడా సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ ఎస్ఈ మురళీధర్ తెలిపారు. నారాయణఖేడ్ మండలం ర్యాకల్ – గంగాపూర్ ప్రాజెక్టుకు సంబంధించి ఎల్లమ్మ గుడి సమీపంలోని తూము షెట్టర్ పడిపోవడంతో చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు అందడం లేదని ఎంపీపీ చాందీబాయి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌చౌహాన్ అధికారులకు తెలిపారు. దీంతో నీటిపారుదల శాఖ ఎస్ఈ మురళీధర్, ఈఈ జైబీం, ఏఈ సూర్యకాంత్‌లు గురువారం గంగాపూర్ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూము షెట్టర్ పడిపోవడం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, అందువల్ల రెండు రోజుల్లో షెట్టర్‌కు మరమ్మతులు చేయించి చివరి ఆయకట్టు రైతులు కూడా సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వారి వెంట మాజీ సర్పంచ్ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకులు సిద్దయ్యస్వామి, సాయాగౌడ్, చంద్రారెడ్డి, రాములు ఉన్నారు.

'పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు'

పటాన్‌చెరు టౌన్: పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ సహాయ కమిషనర్ వీరేశం హెచ్చరించారు. గురువారం కార్మిక శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పేటలో సత్య ఉడ్‌వర్క్‌లో పని చేస్తున్న బాలుడిని గుర్తించి యాజమానిపై కేసు నమోదు చేసి, బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వీరేశం మాట్లాడుతూ.. మైనర్లతో పనులు చేయిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు'



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ డాక్టర్ శరత్ తెలిపారు. గురువారం వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు కంటి వెలుగు నిర్వహణపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్రమత్తంగా ఉంటూ విజయవంతం చేయాలన్నారు. కంటి వెలుగు క్యాంపుల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఆర్పీలు, వీఓఏలను భాగస్వామ్యం చేయాలన్నారు. క్యాంపు నిర్వహణపై ప్రజలకు ముందస్తు సమాచారం తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 69 బృందాలతో కంటి వెలుగు క్యాంపులను నిర్వహిస్తున్నామని, అవసరమైన సామగ్రి అందుబాటులో ఉందని తెలిపారు. జిల్లాకు ఇప్పటి వరకు 64,900 రీడింగ్ గ్లాసెస్ వచ్చాయని, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 854 క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు బృందాలకు శిక్షణ పూర్తయిందని, కార్యక్రమ క్యాంపులకు సంబంధించి ఉత్తర్వులు ఇచ్చామని వివరించారు. రేషన్ షాపుల వద్ద కంటి వెలుగు శిబిరాల సమాచారం తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసున్నామన్నారు. పట్టణాల్లో కూడళ్ల వద్ద హోర్డింగులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. క్యాంప్ నిర్వహణకు మూడు రోజుల ముందు టామ్ టామ్ వేయిస్తామన్నారు. కంటి వెలుగుకు సంబంధించి కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 86 శాతం ప్రసవాలతో సంగారెడ్డి జిల్లా టాప్‌లో ఉండటంతో జిల్లా యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజర్షిషా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గాయత్రి దేవి, డీపీఓ సురేశ్‌మోహన్ ఉన్నారు.

యువతకు స్ఫూర్తి వివేకానంద

సంగారెడ్డి టౌన్: యువత జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని గురువారం జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి పూలమాల నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజర్షిషా, జిల్లా యువజన క్రీడా శాఖాధికారి రాంచందర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్‌బన్సల్
- మెదక్ పార్లమెంటరీ ప్రవాస్ యోజన సమావేశంలో దిశానిర్దేశం
- హాజరైన ఉమ్మడి జిల్లా నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌బన్సల్

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభారీ సునీల్‌బన్సల్ సూచించారు. గురువారం వర్గల్ మండలం గౌరారంలోని ఓ ఫాంహౌజ్‌లో మెదక్ పార్లమెంటరీ ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో రెండోసారి అధికారంలోకి రావడానికి అనుసరించిన వ్యూహాన్ని బీజేపీ శ్రేణులు ఇక్కడ అమలు చేయాలన్నారు. ప్రతి మండలానికి వెయ్యి మంది కార్యకర్తలు సిద్ధమైతే నియోజకవర్గాల్లో గెలుపు కష్టమేమీ కాదన్నారు. పార్లమెంటరీ ప్రవాస్ యోజనలో భాగంగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రులు విస్తృతంగా పర్యటిస్తారన్నారు. అధ్యక్షత వహించిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో పార్టీని రెండుసార్లు అధికారంలోకి తెచ్చిన సునీల్ బన్సల్ దిశానిర్దేశంలో ఇక్కడ కూడా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త తమకిచ్చిన బాధ్యతను కృతనిశ్చయంతో పూర్తిచేసి బీజేపీ బలోపేతానికి బాటలు వేయాలన్నారు. నిజామాబాద్ ఎంపీ, మెదక్ అసెంబ్లీ పాలక్ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ మెదక్ అసెంబ్లీని బీజేపీ ఖాతాలో వేసే విధంగా తాను బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రతి బూతులో కార్యకర్తలు చురుగ్గా పని చేస్తున్నారని విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీ గెలుపు వ్యూహాలను రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిలాల అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ ప్రభరి జయశ్రీ, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి రామ్మోహన్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు నందీశ్వర్‌గౌడ్, కూన శ్రీశైలం, గుజ్జుల రామకృష్ణారెడ్డి, గురువారెడ్డి, పార్లమెంట్ పరిధిలోని బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కె రన్



వివేకనందుడి ఫ్లెక్సీతో పరిగెడుతున్న యువత

సంగారెడ్డి మున్సిపాలిటీ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గురువారం యువజన సంఘాలు, కుల సంఘాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వివేకనందుడి చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పుల్కల్ మండల కేంద్రంతో పాటు కోడూరు గ్రామంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ ఆవిష్కరించారు. భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఉత్సాహంగా 5కె రన్ నిర్వహించారు. రన్ పూర్తయిన తర్వాత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పవన్, ప్రధాన కార్యదర్శి రాకేశ్‌ఠాకూర్, ఉపాధ్యక్షులు సందీప్ గౌడ్, విజయ్ శేఖర్, కార్యాలయ కార్యదర్శి ఆదిత్య, నరేస్ దేశ్‌పాండె, అసెంబ్లీ కన్వీనర్లు ప్రవీణ్, రవి, మాణిక్యం పట్టణ అధ్యక్షుడు వినోద్, రవి, మండల అధ్యక్షుడు సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులతో బస్టాండ్ కిటకిట


బస్టాండ్ ఆవరణలో విద్యార్థుల సందడి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలకు శుక్రవారం నుంచి సోమవారం వరకు సెలవులు ప్రకటించింది. దీంతో గురువారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహాలు, గురుకులాల నుంచి విద్యార్థులు తమ ఇళ్ల బయలుదేరారు. విద్యార్థుల రాకతో పట్టణం, బస్టాండ్ పరిసర ప్రాంతాలు, బస్సులు కిటకిటలాడాయి.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్‌లను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంతరావు తెలిపారు. ఈ మేరకు మండలంలోని బిజిలిపూర్ శివారులో కేజ్‌వీల్స్‌తో బీటీ రోడ్డు ఎక్కిన నంబర్ ప్లేట్‌లేని ట్రాక్టర్ డ్రైవర్ బానోత్ రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గతంలోనూ దంతాన్‌పల్లి శివారులో కేజ్‌వీల్స్‌తో రోడ్డుపైకి వచ్చిన ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 15 మంది పట్టుబడ్డారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి 14 మంది ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమాన విధించగా, ఓ వ్యక్తికి రూ.3 వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పెయింటర్ అదృశ్యం


సతీశ్ కుమార్ (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: పెయింటర్ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సతీశ్ కుమార్ యాదవ్ బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చాడు. కాంట్రాక్టర్ అనిల్ వద్ద పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో 7వ తేదీన పనికి రాక రావడంతో సతీశ్ కుమార్‌కు అనిల్ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో సతీశ్ కోసం తెలిసినవారిని, కుటుంబ సభ్యులకు అడిగినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో సతీశ్ అదృశ్యంపై కాంట్రాక్టర్ అనిల్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ల్యాప్‌టాప్ మాయం

రామచంద్రాపురం(పటాన్ చెరు): తహసీల్దార్ కార్యాలయంలో లాప్ టాప్ మాయమైంది. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి టేబుల్ పై తన లాప్ టాప్ ఉంచాడు. గమనించిన అపరిచిత వ్యక్తి తీసుకెళ్లాడు. టేబుల్ పై లాప్ టాప్ కనిపించకపోవడంతో అధికారి కంగారుపడి కార్యాలయం అంతా వెతికాడు. సీసీ కెమెరా పుటేజ్ పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి తన బ్యాగ్ లో పెట్టుకుంటున్నట్లు గమనించారు. ప్రభుత్వ కార్యాలయంలోనే లాప్ టాప్ మాయంకావడం చర్చనీయంగా మారింది.

పొట్లపల్లిలో మల్లికార్జుస్వామి బ్రహ్మోత్సవాలు

- భోగి పండగ నాడు గోదాదేవి, రంగనాయకుల కల్యాణం
- మల్లన్న బోనాలు, పట్నాలు, అగ్ని గుండాలు
- మద్యం, మాంసం ముట్టని భక్తులు


జాతరకు ఎడ్లబండిని సిద్ధం చేస్తున్న రైతు కుటుంబం

హుస్నాబాద్‌రూరల్: పొట్లపల్లి ఊరు అధ్యాత్మకతకు నిలయం. అక్కడ నిత్య పూజలు, భగవంతుడిని ఆరాధిస్తుంటారు. భక్తి గీతాలు ఆలపిస్తూ దైవారాదనకే ఎక్కువ సమయం కేటాయిస్తారు. 10వ శతాబ్దములో 101 దేవాలయలకు నిలయంగా వెలసిన పొట్లపలి కాలక్రమంలో అవి కాలగర్భంలో కలిసిపోయి పుణ్యక్షేత్ర శోభను కోల్పోయింది. తర్వాత కాలంలో రావులవారి పొలంలో నాగలి కర్రుకు తాకి వెలుగు చూసింది. రావుల మల్లికార్జున స్వామి (పురాతన శైవక్షేత్రం) భక్తుల నిత్యపూజలు అందుకుంటున్నాడు. మల్లికార్జున స్వామి క్షేత్రానికి సమీపంలోనే కాకతీయుల కాలంలో నిర్మించిన శ్రీ సీతారాముల దేవాలయం ఉంది. వీటికి సమీపంలో ఓ శాలివాహనుడి ఇంటి నిర్మాణం కోసం పునాది తవ్వుతుంటే పెద్ద శివలింగం బల్పడింది. ఊరంత దేవాలయలు ఉండటం ఎప్పుడూ ఉత్సవాల పేరున గ్రామంలో అధ్యాత్మకత వెల్లి విరుస్తుంది. చుట్టుపక్కల గ్రామాలు, పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలి రావడంతో పొట్లపల్లికి ప్రత్యేక పేరు వస్తుంది.

భోగి పండగ (కల్యాణ మహోత్సవాలు)

భోగి పండక రోజున శ్రీ సీతారామాలయంలో గోదాదేవి, రంగనాయకుల కల్యాణం మహోత్సవం, మల్లికార్జునస్వామి ఆలయంలో శివకళ్యాణం మహోత్సవాలు జరుగుతాయి. వీరి కల్యాణ మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వస్తారు. రావుల మల్లికారునస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలు లేక పోవడంతో మూల విరాట్కే కల్యాణం నిర్వహిస్తారు. గోదాదేవి, రంగనాయక కల్యాణ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యాహాజరవుతారు.

బోనాలు, ఎడ్ల బండ్ల జాతర

సంక్రాంతి పండగ రోజున ప్రతి ఇంటి నుంచి మల్లన్నకు బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకుంటారు. ఒక్క రోజే ఊరంత బోనాలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. ఉత్సవాలలో భాగంగా రాత్రి స్వామివారి పట్నాలు వేస్తారు. వీటిని తిలకించేందుకు ప్రజలు తరలివస్తారు. పొట్లపల్లి గ్రామంలో రాజేశ్వస్వామి ఆలయం ఉండటంతో దైవదర్శనం చేసుకునేందుకు భక్తులు తరలివస్తారు. సంక్రాంతి నాడు జరిగే మల్లికార్జునస్వామి ఉత్సవాలకు కూడా కోహెడ, చిగురుమామిడి, అక్కన్నపేట మండలాలు, కరీంనగర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని సందర్శించుకుంటారు. సంక్రాంతి రోజు రాత్రి బోనాల ఉత్సవాలతో ఆలయ ప్రాగణంలో జాతర సందడి నెల కొంటుంది. మల్లన్న బోనాలు సమర్పించిన భక్తులు ఆ రాత్రి ఆలయం ఆవరణలోనే నిద్రించి తెల్లవారి జామున జరిగే అగ్ని గుండాలను తిలకిస్తారు. అగ్ని గుండాలను దాటి స్వామిపై తమకున్న అచంచల భక్తిని చాటుతారు. ఈ అగ్నిగుండాలు దాటేందుకు హైదరాబాద్ నుంచి భక్తులు తరలివస్తారు. మూడు రోజులు నిర్వహించే మల్లికార్జున స్వామి ఉత్సవాలు అగ్ని గుండాలతో ముగిస్తాయి. పుణ్యక్షేత్రాలకు నిలయంగా ఉన్న పొట్లపల్లికి భక్తుల రాక ఏటా పెరుగుతూవస్తోంది.


మల్లికార్జున స్వామి

ఊరంత మద్యం, మాంసం బంద్

సంక్రాంతి పండగ రోజున ఊరంత మల్లన్న బోనాలు చేస్తారు. పట్నాలు వేస్తారు. దీంతో ఊరులో ఎక్కువ మంది ఉపవాస దీక్షలు చేపడతారు. ఆరోజు ఊరంత మద్య, మాంసాహారానికి దూరంగా ఉంటారు. తెలంగాణ రాష్ట్రంలో ఇదో ప్రత్యేకత. అత్తారింటికి వచ్చిన కొత్త అల్లుళ్లు కూడ వీటికి దూరంగా ఉంటారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఊరంత విందు చేసుకుంటారు.

వెస్లీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ధర్నా

కళాశాలను సీజ్ చేసిన అధికారులు


కళాశాలను సీజ్ చేస్తున్న డీఐఈఓ సత్యనారాయణ

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా మెదక్‌లోని వెస్లీ జూనియర్ కళాశాల వేధింపులకు పాల్పడుతోందని, ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఏబీవీపీ ఆరోపించింది. గురువారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా మెదక్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వెస్లీ జూనియర్ కళాశాలలో కనీస మౌలిక వసతులు లేవని, సరిపడా లెక్చరర్లు లేకుండానే కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. అడ్మిషన్ల సమయంలో ఉచిత బోధన అని చెప్పి కోర్సు పూర్తి చేసిన తర్వాత ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ విద్యార్థులతో దురుసుగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థినులు సర్టిఫికెట్స్ కావాలని అడిగితే ప్రిన్సిపాల్ చంద్రపాల్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కళాశాలకు వచ్చిన మెదక్ డీఐఈఓకు వినతిపత్రం అందజేశారు. మౌలిక వసతులు లేని కళాశాల గుర్తింపు రద్దుచేసి వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన డీఐఈఓ కళాశాలను సీజ్ చేయడంతోపాటు విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు తరలించారు. ఇలాంటి ఘటనలు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్ ఇచ్చారు. ధర్నాలో మెదక్ జిల్లా కన్వీనర్ శశికాంత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెస్లీ కళాశాల సీజ్

మెదక్ పట్టణంలోని వెస్లీ జూనియర్ కళాశాలను డీఐఈఓ సత్యనారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కనీస వసతులు లేకుండా నడుపుతున్నందున వెంటనే కళాశాలను సీజ్ చేశారు. విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తరలించారు. కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు సిఫారస్ చేసినట్లు డీఐఈఓ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విద్యుత్ వైరు ఉండటంతో మృతిపై అనుమానం

పటాన్‌చెరుటౌన్: పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండల పరిధి ఇంద్రేశం గ్రామ శివారులో టప్ప కృష్ణ పొలంలో గుర్తుతెలియని వ్యక్తి(39) మృతదేహం కనిపించింది. స్థానికులు వీఆర్‌ఏకు తెలపడంతో ఆయన పటాన్‌చెరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కన విద్యుత్ వైర్ ఉండటంతో విద్యుదాఘాతంతో మృతిచెందాడా లేక అనారోగ్య సమస్యతో మృతిచెందాడా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు


విద్యార్థులతో సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధ్యాయులు

దుబ్బాక: జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ క్రీడా పోటీలకు దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ యజ్ఞశ్రీ తెలిపారు. ఇటీవల చేగుంటలో రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ క్రీడలో సిద్దిపేట జిల్లా తరుపున పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబర్చారన్నారు. సాయికిరణ్ ,రోహిత్, నరేందర్, బాల్‌రాజ్, అనిల్, రాకేష్, అంజి, వేదంత్, యోగేందర్, కౌశిక్ ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్ ఐటీఎం యూనివర్సిటీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడంతో గురువారం సర్పంచ్ ముత్యం గారి యాదగిరి, ఎంపీటీసీ ఆది వనిత వేణుగోపాల్ వారికి క్రీడా దుస్తులు అందించారు. మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పీఈటీ సురేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేందర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాల్లో బైక్ కాల్చివేత


కాలిపోయిన బైక్‌ను పరిశీలిస్తున్న ఏఎస్ఐ విఠల్

శివ్వంపేట(నర్సాపూర్): భూ తగాదాల నేపథ్యంలో ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను తగులబెట్టారు. ఈ సంఘటన మండల పరిధి గంగాయాపల్లి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఏఎస్ఐ విఠల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లచ్చన్నగారి చంద్రం తన బైక్‌ను రోజుమాదిరిగా బుధవారం తన ఇంటి ముందు పార్క్ చేశాడు. బైక్‌ను చంద్రం అన్న కుమారుడు స్వదేశ్ తగులబెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నదమ్ముల మధ్య భూ తగాదాలతో సంఘటన చోటుచేసుకుందన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృత్యువాత


యాదగిరి (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): బైక్‌పై కంపెనీకి వెళ్తున్న యువకుడిని లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన చిన్నోల్ల నర్సింలు, లలిత దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వీరిలో పెద్ద కుమారుడు యాదగిరి (26) ఉపాధి కోసం మనోహరాబాద్ మండలం దండుపల్లి వచ్చాడు. ఇద్దరు మిత్రులతో కలిసి అద్దెకుంటూ కండ్లకోయ వద్ద ట్రాన్స్‌కోలో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం వేకువ జామున బైక్‌పై కండ్లకోయకు వెళ్తుండగా మార్గమధ్యలో జాతీయ రహదారి-44పై కాళ్లకల్ వద్ద హైదరాబాద్ వెళ్తున్న హరియాణకు చెందిన కంటెయినర్ లారీ అదుపుతప్పి వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో యాదగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుడికి రెండేళ్ల క్రితం నాగలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర కూతురు ఉంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాళ్లకల్ వద్ద రోడ్డుపై ఆటోలు ఇష్టారీతిన పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మాధవి మృతదేహం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి చెందింది. ఈసంఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం మునిగడప గ్రామానికి చెందిన వడ్డెర భిక్షపతి కూతురు మాధవి కొండపాకలోని బాలికల హైస్కూల్లో గతేడాది టెన్త్ పూర్తి చేసింది. మెమో తీసుకెళ్లేందుకు మేడ్చల్ నుంచి అమీర్‌తో కలిసి బైక్‌పై వస్తున్నారు. తిమ్మారెడ్డిపల్లి శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు హద్దు రాయికి బలంగా ఢీకొట్టడంతో మాధవీ, అమీర్ ఎగిరిపడ్డారు. దీంతో మాధవికి తీవ్రంగా, అమీర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మాధవి మృతి చెందింది. మాధవి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అంబులెన్స్ ఎలా పని చేస్తుంది ?


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం

కొండపాక(గజ్వేల్): కొండపాక 108 అంబులెన్స్‌ను కరీంనగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం మండల శివారులో ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షతగాత్రులకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంబులెన్స్‌లో అత్యవసర మెడిసిన్ ఉందా లేదన్న విషయాన్ని పరిశీలించారు. వైద్యసేవల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ అంబులెన్స్‌కు సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు వైద్యసేవలు అందించాలన్నారు. జిల్లాలో స్థానిక అంబులెన్స్ పనితీరు మొదటి స్థానంలో ఉందంటూ సిబ్బంది పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో టెక్నీషియన్ మహేందర్, పైలెట్ రమేశ్, జిల్లా కోఆర్డినేటర్ కుమార స్వామి, ఏఎఫ్ఈ చక్రపాణి, డీఆర్వో రాజు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ఎక్కి వ్యక్తి హల్‌చల్

- మతిస్థిమితం లేకపోవడంతో పుట్టింటికి వెళ్లిన భార్య
- ఆత్మహత్య చేసుకుంటున్నానని కేకలు
- కాపాడిన పోలీసులు


వాటర్‌ట్యాంకు ఎక్కిన రవీందర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): వాటర్ ట్యాంకు ఎక్కి ఓ వ్యక్తి తన సమస్యను పరిష్కరించకుంటే కిందకు దూకుతానని హంగామా చేసిన సంఘటన చేగుంటలోని బుడగ జంగాల కాలనీలో గురువారం చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి కొద్ది కాలంగా విచిత్రంగా ప్రవర్తిస్తుండటంతో భార్య అపర్ణ పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో నిత్యం మద్యం సేవిస్తూ మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరిస్తున్నాడు. గురువారం చేగుంట బుడగజంగాల కాలనీ ట్యాంకుపైకి ఎక్కిన రవీందర్‌రెడ్డి తనను కొంతమంది చంపడానికి ప్రయత్నిస్తున్నారని, భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని దీంతో ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చానని కేకలు వేశాడు. తనను దింపడానికి వస్తే ట్యాంకుపై నుంచి దూకుతానని బెదిరించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని, ట్యాంకు దిగితే సమస్య పరిష్కరిస్తామని నచ్చజెప్పారు. రవీందర్‌రెడ్డి గురించి తిమ్మాపూర్ గ్రామస్తులకు సమాచారం అందించారు. యోగా కోచ్ కరణం గణేష్ ట్యాంకు వద్దకు వచ్చి తిమ్మాపూర్ గ్రామస్తులు రవీందర్ బంధువులతో ఫోన్‌లో మాట్లాడించి ట్యాంకుపైనుండి దింపారు. రవీందర్‌రెడ్డి డిప్రెషన్‌లో ఉన్నట్లు గుర్తించిన ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ నిర్వహించారు.

నాగరాజుకు అభినందనల వెల్లువ


లాకింగ్ సిస్టం పనిచేసే విధానాన్ని వివరిస్తున్న నాగరాజు

సిద్దిపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్‌స్పైర్ టు అస్పైర్ ప్రోగ్రాంలో అంధుల విభాగం నుంచి గుర్రాలగొంది గ్రామానికి చెందిన ఏర్వ నాగరాజు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో ఎంపికయ్యాడు. గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, గ్రామస్తులు నాగరాజ్‌కు అభినందనలు తెలిపారు. ఆత్మవిశ్వాసంతో ప్రోగ్రాంలో ఇన్‌సైడ్ డోర్ లాకింగ్ సిస్టం అందరినీ ఆకట్టుకోవడంతో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

ఉపాధ్యాయురాలికి అవార్డు


అవార్డును అందుకుంటున్న రూపారాణి

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్ గణిత ఉపాధ్యాయురాలు రూపారాణి ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిట్ కేరళలోని (తిరుచ్చి) దక్షిణ భారత దేశ సైన్స్ మ్యాచ్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయుల కెటగిరీలో అవార్డును గురువారం అందుకున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిర్సనగండ్ల హైస్కూల్ పేరును రాష్ట్రస్థాయిలో నిలిచేలా చేయడంపై ఉపాధ్యాయురాలు రూపారాణి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారన్నారు.

వేర్వేరు చోట్ల ఏడుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల వ్యక్తిగత కారణాలతో ఏడుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వారిలో నలుగురు మహిళలు ఉండటం విచారకరం. జీవితంపై విరక్తి చెంది నలుగురు బలవన్మరణం పొందారు. అప్పుల బాధతో మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జి.సుశీల (ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పేట ఏఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన జి.సుశీల(50) భర్తకు మతిస్థిమితం లేకపోవడంతో ఏ పనిచేయడం లేదు. ఈ విషయంపై గత కొన్నేళ్లుగా ఆమె ఆందోళన చెందుతోంది. ఇటీవల తన పుట్టిల్లు పెద్దశంకరంపేట మండలం సంగారెడ్డిపేట వచ్చింది. మంగళవారం తన గ్రామానికి వెళ్తున్నట్లు తన తమ్ముడికి చెప్పి ఇంటి నుంచి అచ్చంపేటకు బయలుదేరింది. పేటకు వచ్చిన సుశీల ఓ దుకాణంలో పురుగులమందు కొని పేటలోని టీటీడి కల్యాణమండపం వద్ద ఖాళీ స్థలంలో తాగింది. గురువారం ఉదయం స్థానికులు మహిళ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించారు. సుశీల ఇంటికి వెళ్లకపోవడంతో ఆమె తమ్ముడు సాయిలు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని సుశీలదిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలుకింద పడి..

చేగుంట(తూప్రాన్): తల్లితో గొడవపడి క్షణికావేశంలో ఓ మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల కేంద్రమైన చేగుంట రైల్వేగేటు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైల్వే ఎస్ఐ తావూనాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డికి చెందిన పెండ్యాల భాగ్య(30) చిన్నకోడూరు మండలం రామంచకు చెందిన రాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. భాగ్యను భర్త వదిలి వెళ్లిపోగా తల్లి నర్సమ్మతో కలిసి చేగుంటలో ఉంటూ కూలీ పనులు చేస్తోంది. బుధవారం రాత్రి నరసమ్మ కూతురు భాగ్యతో గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన భాగ్య ఇంటి నుంచి వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు. మృతురాలు భాగ్యకు కూతుర్లు అమృత, అర్చన, కుమారుడు ఆకాశ్ ఉన్నారు.

భార్యాభర్తలు గొడవపడి..

భార్యాభర్తలు గొడవపడి భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నడిమితండా గ్రామ పంచాయతీ పరిధి సాజు తండాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సాజుతండాకు చెందిన మూడ్‌స్వామి, శారద దంపతులు బుధవారం రాత్రి గొడవ పడ్డారు. దీంతో గురువారం ఉదయం శారద (30) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు తండాకు చేరుకొని కేసు విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

దుబ్బాక: అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో జరిగింది. గురువారం రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మంతూర్ గ్రామానికి చెందిన పట్నం మల్లయ్య (72) వ్యవసాయం చేస్తున్నాడు. చిన్న కొడుకు 3 సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి పిల్లలను మల్లయ్య పోషిస్తున్నాడు. పిల్లల పోషణ, పంటల సాగుకు చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. అప్పులపై భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో మల్లయ్య బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి శవ పరీక్ష నిమిత్తం మృతుదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పట్నం నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మల్లయ్య (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చిలప్‌చెడ్ మండలం చండూర్ శివారులో గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఏఎస్ఐ మిస్బావుద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చండూర్ గ్రామశివారులోని చింతచెట్టుకు మృతదేహం వేలాడుతోందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం చండూర్ గ్రామానికి చెందిన దుబ్బల మహేందర్ (28)గా గుర్తించారు. మృతుడి భార్య స్వప్న, తల్లి సత్తమ్మ కూడా ధ్రువీకరించారు. అప్పులు ఎక్కువై మహేందర్ ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మహేందర్ పదిరోజులుగా కనబడకపోయినప్పటికీ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

కూతురుతో చెరువులో దూకి తల్లి ఆత్మహత్య


పద్మ, శివానీ మృతదేహాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: జీవితంపై విరక్తి చెంది కూతురుతో చెరువులో దూకి తల్లి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పుల్కల్ ఎస్ఐ కుమార గణేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట గ్రామానికి చెందిన పుల్లపు పద్మ(32)కు పాపన్నపేటకు చెందిన పుల్లపు మల్లేశ్‌తో వివాహం జరిగింది. పదేళ్ల క్రితం మల్లేశ్ చనిపోయాడు. అప్పటి నుంచి పుట్టిల్లు శివంపేటలో ఉంటోంది. ఈ క్రమంలో పటాన్‌చేరు మండలం చిట్‌కుల గ్రామానికి చెందిన తన అక్క భర్త తమ్ముడు పల్లపు మల్లేశ్‌తో సహజీవనం చేస్తోంది. మల్లేశ్‌కు పెళ్లి కుదరడంతో పద్మను వదిలేసి పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇందుకు అంగీకరించని పద్మ పెళ్లి చేసుకోవద్దని తన దగ్గరే ఉండాలని పట్టు పట్టింది. అయినా మల్లేశ్ వినకుండా తాను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తీవ్ర మనస్థాపానికి గురైన పద్మ గురువారం కూతురు శివానీ (5)తో కలిసి గ్రామంలోని చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. పద్మ తల్లి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించిన్నట్లు వెల్లడించారు.